క్లుప్తంగా

చదువుతోనే బంగారు భవిష్యత్

శాంతినగర్: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని వడ్డేపల్లి ఎంఈఓ నరసింహులు అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాయి కిశోరబాలికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. బాల్య వివాహాలు, వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు హనిమిరెడ్డి, నాగపుల్లయ్య, ఉపాధ్యాయులు సామేల్, శేషమ్మ, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

అయిజ: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నతాండ్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని దీంతో కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ జయన్న, కృష్ణ, నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవులను వధిస్తే చర్యలు

ఎర్రవల్లిచౌరస్తా: పండగ పేరుతో గోవులను వధిస్తే చర్యలు తీసుకుంటామని ఇటిక్యాల ఎస్ఐ గోకారి, కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగను నిర్వహించుకోవాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించొద్దని కోరారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత

రాజోళి(మానవపాడు): భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరులో త్రైత సిద్ధాంత భగవద్గీత సారాంశాన్ని వివరిస్తూ ప్రచారం చేశారు. కుల మతాలకతీతంగా గ్రంథాలను పఠించాలని దీని ద్వారా మానవుడి జన్మ సార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో ఇందూ విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

శాంతినగర్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తోట హరీష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2005 సమాచార చట్టం ప్రకారం పాఠశాలల పూర్తి వివరాలు ఇవ్వాలని ఎంఈఓను కోరినా వివరాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

ఉపాధ్యాయురాలు సస్పెన్షన్

మల్దకల్: మండలంలోని శేషంపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు విజితను సస్పెన్షన్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి తెలిపారు. పాఠశాలకు సక్రమంగా రావడంలేదని సర్పంచ్ ప్రతాప్ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాం. దీంతో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు డీఈఓ సిరాజుద్దీన్ టీచర్ విజితను సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

మల్దకల్: చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి సూచించారు. బుధవారం మండలంలోని పావనంపల్లి, పాల్వాయి, పెద్దపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ కమలాదేవి మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, యామిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మాకొద్దు

శాంతినగర్: వడ్డేపల్లి మండలం కొంకల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడ బీసన్నపై అనవసరంగా పిల్లలను కొడుతున్నాడని, వేధిస్తున్నాడని గతంలో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిని రాజోళి పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. రెండు రోజుల కిందట ఇక్కడే ఉపాధ్యాయుడు బీసన్నకు పోస్టింగ్ ఇచ్చారు. బుధవారం పాఠశాలకు బీసన్న వస్తున్నారని గ్రామస్తులకు సమాచారం అందింది. దీంతో ఉపాధ్యాయుడిని లోపలికి వెళ్లకుండా పాఠశాల గేట్ వద్దే విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకున్నారు. గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. అంతేగాక విద్యార్థులు సైతం మాకు బీసన్నసారు వద్దంటూ తరగతి గదుల్లోనే నినాదాలు చేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిసతే పిల్లలను బడి మాన్పిస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు. చేసేదేమిలేక ఉపాధ్యాయుడు వెనుదిరిగాడు.

జీవన ఎరువులపై దృష్టి


వల్లూరులో కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ సక్రియానాయక్

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు జీవన ఎరువులపై దృష్టి సారించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందాలని ఏడీఏ సక్రియానాయక్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని వల్లూరులో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రైతులకు పీఆర్‌జీ–176 రకానికి చెందిన కంది విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా ఏడీఏ హాజరై రైతులకు ఉచితంగా నాలుగు కేజీల కంది విత్తన బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులతో పాటు పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పంట వేయడానికి ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పెసర, అలసంద వంటి పంటలను సాగుచేయాలన్నారు. సాగు చేసిన పచ్చిరొట్ట ఎరువులను 45 నుంచి 50 రోజుల లోపు పొలంలోనే కలియదున్నడం వల్ల భూసారాన్ని పూర్తిగా పెంచుకోవచ్చన్నారు. అదేవిధంగా పంట పొలాల్లో పీఎస్‌బీ బ్యాక్టీరియాను వాడితే నేలలోని కరగని భాస్వరాన్ని కరిగించి పూర్తిగా మొక్కలకు అందిస్తుందన్నారు. మండలంలో మొత్తం 290 మినీ కిట్లు (4 కేజీలు బ్యాగులు) అందుబాటులో ఉన్నాయని ప్రతి క్లస్టర్‌కి 24 కిట్లను అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జెన్నిఫర్, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్తువుల వితరణ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని దువాసిపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం గ్రామానికి చెందిన గౌని వెంకట్రాముడు తన తల్లి శంకరమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ధరూరు: చిన్నప్పటి నుంచే బాగా చదివి ప్రయోజకులు కావాలని బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి అన్నారు. బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, విద్య అందుతుందన్నారు. పిల్లలతో పనులు చేయించడం నేరమన్నారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, కృష్ణకుమార్‌రెడ్డి, రాధా, మధుమతి పాల్గొన్నారు.

బాలికలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు నైపుణ్యంపై బుధవారం ఎస్‌జీఓ వాయిస్ 4 గర్ల్స్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. బుధవారం 8,9,10 తరగతులతో ఒక్కో తరగతికి నలుగురిని ఎంపిక చేసి ప్రాథమిక హక్కులను, యుక్త వయసులకు, రుగ్మతలు, సంస్కృతి, సమాజంపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ నెల 24 నుంచి జులై 4 వరకు 10 రోజులు శిక్షణ కల్పిస్తున్నట్లు పీఈటీ అరుణతారా తెలిపారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని గౌడ సంఘం జిల్లా నాయకుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ సూచన మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్(గొర్లఖాన్‌దొడ్డి), గౌరవ అధ్యక్షుడిగా మునిచంద్రగౌడ్ (చాగదోన), ఉపాధ్యక్షుడిగా ఆటోరాముడు (తుమ్మలపల్లి), ప్రధాన కార్యదర్శిగా జయరాంగౌడ్ (చిన్నోనిపల్లె), కోశాధికారిగా రాఘవేంద్రగౌడ్ (యల్లందొడ్డి), ప్రచార కార్యదర్శిగా కార్తీక్‌గౌడ్ (చాగదోన), కార్యవర్గ సభ్యులుగా నర్సన్నగౌడ్, తిక్కయ్యగౌడ్, వెంకటన్నగౌడ్, అంజయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ వీరన్నగౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు కౌన్సిలర్ నరహరిగౌడ్, శ్రీనుగౌడ్, రఘురాజ్‌గౌడ్, మాచర్ల వెంకటస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంచు లక్ష్మికి సన్మానం

గద్వాల: సినీనటి మంచు లక్ష్మిప్రసన్నను బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి ఆహ్వానం మేరకు డీకే బంగ్లాలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు డీకే స్నిగ్ధారెడ్డి, రవికుమార్‌లు మంచు లక్ష్మిప్రసన్నలను సన్మానించారు. గద్వాల చరిత్ర, జరీ చీరల ప్రాముఖ్యత గురించి వివరించారు.

కేటీదొడ్డి: వెంకటాపురం, వాగుతండా, చింతలకుంటలోని పాఠశాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సినీనటి మంచు లక్ష్మికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో డిజిటల్ విద్య, మౌలిక వసతులు కల్పించనున్నారు. ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు గోపీలు సంతోషం వ్యక్తం చేశారు.

అన్నిరంగాల్లో మున్నూరు కాపులు వెనుకబాటు

గద్వాల అర్బన్: మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రతి ఏడాది రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మున్నూరు కాపు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపులు విద్యా, ఉపాధి తదితర రంగాల్లో వెనుకబడిపోయారన్నారు. హాస్టల్ భవనాల నిర్మాణం కోసం ఎకర స్థలాన్ని కేటాయించి రూ.2కోట్ల నిధులు కేటాయించాలని, జనాభా ప్రతిపాదికన అన్ని రంగాలతో పాటు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలన్నారు. న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్ కార్యాలయానికి ఉత్తరాలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్ కుమార్, నర్సింహులు, వెంకట నారాయణ, జెడ్పీటీసీ పద్మ, రాజేందర్, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి మహిళలు కృషి చేయాలి

అయిజ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పీసీసీ అధికార ప్రతినిధి శ్రీశైలి ఆచారి అన్నారు. బుధవారం పట్టణంలో బూత్ లెవల్ యూత్, మహిళా కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు మహిళలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. మహిళా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి హనుమన్న, అధికార ప్రతినిధి మైనర్‌బాబు, సేవాదళ్ అధ్యక్షురాలు సులోచనమ్మ, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ పాల్గొన్నారు.

పెద్దవాగుపై వంతెన నిర్మించండి


వంతెనను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణ సమీపంలోని రాయచూరు–కర్నూలు మార్గంలో ఉన్న పెద్దవాగుపై శిథిలమైన బ్రిడ్జిని తొలగించి, నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు భీమసేన రావు, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు శిథిలమైన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం బీజేపీ డాక్టర్ సెల్ కో కన్వీనర్ శంకరయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య ఆచారి, పట్టణ ఉపాధ్యక్షుడు జానకి రాములు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు అంజి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈరన్న పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ ఎదుట రైతుల ఆందోళన

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారు భారత్ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న రైతు మిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో ఈ నెల 18న రూ.18 లక్షలు చోరీకి గురైన విషయం విధితమే. ఇదిలా ఉండగా బుధవారం రైతు మిత్ర కోల్డ్ స్టోరేజ్ ఎదుట మిర్చి రైతులు మా డబ్బులు ఎప్పుడు ఇస్తారని మేనేజర్ మధును, యజమాని రామాచంద్రారెడ్డిని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటన స్థలానికి రైతులను అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి


సమావేశానికి హాజరైన ముదిరాజ్ నాయకులు

కేటీదొడ్డి: ముదిరాజ్ కులస్తులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నందిన్నెలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితువు పలికారు. వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు రమేష్, వెంకటేష్, భీమేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అయిజ: పట్టణ సమీపంలోని పులికల్ రోడ్డుపై బుధవారం కారు అదుపుతప్పి పోలోని వాగులోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మక్తల్‌కు చెందిన కృష్ణమూర్తి ప్లాట్లను చూసేందుకు కర్నూల్ వైపు వెళ్తండగా మార్గమధ్యలో కారు అదుపుతప్పింది. పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. స్థానికులు గమనించి కారులో ఉన్న కృష్ణమూర్తిని సురక్షితంగా బయటకు తీశారు. త్రుటిలో ప్రమాదం నుంచి బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



అయిజ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి ఏఐసీసీ అధికార ప్రతినిధి శ్రీశైలి ఆచారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఆర్థిక సంస్కరణలో తీసుకొచ్చిన మహనీయుడు పీవీ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

గట్టు: మండల కేంద్రంతో పాటు మాచర్లలో ఎక్సైజ్ ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిరాణ దుకాణాల్లోనూ బెల్లం అమ్మకాలపై ఎక్సైజ్ పోలీసులు ఆరా తీశారు. అదేవిధంగా మాచర్లలోని కిరాణ దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత బెల్లం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులకు సూచించారు.

ఐలమ్మ విగ్రహావిష్కరణ



ధరూరు: రజకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినపుడే చాకలి ఐలమ్మ కలలుగన్న రాజ్యం వస్తుందని రజక ఎస్సీ సాధన సమితి అధ్యక్షురాలు పత్తికొంత శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పేరులో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ వీర వనితగా.. పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఐలమ్మ ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలన్నారు. చట్ట సభల్లో రజకులు అడుగుపెట్టి ప్రజా సేవలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాశమ్మ, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, రజక సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్, రజక సంఘం నాయకులు టైలర్ ఆంజనేయులు, గోపాల్, మాశన్న, తాయన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు

రాజోళి(మానవపాడు): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తారని డాక్టర్ రిజ్వానా అన్నారు. బుధవారం మానవపాడు మండలంలోని బోరవెల్లి, జల్లాపురం గ్రామాల్లో ఆమె ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. వ్యాధి నిరోధక టీకాల నమోదును ఎప్పటికప్పుడు రిజిస్టార్‌లో నమోదు చేయాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భాగవత పారాయణం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో బుధవారం భాగవత పారాయణాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం సభ్యులు ఐదో రోజు ఆలయంలో భక్తులకు మాదాంధ్ర భాగవత సప్తాహం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, అర్చకులు, భక్తులు, తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

ధరూరు: జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఏపీడబ్ల్యూజే యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు పాత్రికేయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, వెంకటన్న, శాంతిరాజు, రవి, రాము, డేవిడ్, అనిల్, ఆర్ఐ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిశీలించండి


పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కుల వృత్తుల వారు రూ.లక్ష రుణం కోసం వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా పరిశీలించి పూర్తి వివరాలు సేకరించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. బుధవారం వడ్డేపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మొత్తం 330 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి చేస్తున్న కుల వృత్తుల గురించి వివరాలు తెలుసుకొని కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ తిరుపతన్న, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, నాగరాజు, లక్ష్మణ్, వినోద్, సత్యకి, జ్ఞానేశ్వరి, మోహన్, లక్ష్మన్నలు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు

అయిజ: మండలంలోని సంకాపురం ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బుధవారం సర్పంచ్ సుజాత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు దంపతుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. 50 మంది విద్యార్థులకు ఉచితంగా పలకలు అందజేశారు. చిన్నప్పటి నుంచి విద్యార్థులకు పెద్దలను గౌరవించే విధంగా నేర్పాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వర్, జానపద కళాకారుడు తిమ్మప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయులు బాలకృష్ణ, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు


కరపత్రాలను అందజేస్తున్న మండల అధ్యక్షుడు జయన్న

అయిజ: మండలంలోని భూంపురం, తొత్తినోనిదొడ్డి గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొత్తినోనిదొడ్డిలో యూత్ డిక్లరేషన్ క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం జయన్న మాట్లాడారు. కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. అధికార పార్టీ నిరంకుశ పాలనను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు, రాముడు, శేఖర్ గౌడ్, హనమంతు, నితిన్ బాబు, మనోహర్, శేషన్న, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. బుధవారం మండలంలోని లింగనవాయిలో రూ.24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎస్సీ మాల కమ్యూనిటీ భవనం, రూ. 5 లక్షల వ్యయంతో బీసీ కమ్యూనిటీ భవనం, రూ. 14 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. గ్రామాలు, పట్టణాల ప్రగతే లక్ష్యం సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బేగం, నాయకులు ధనుంజయ్, నర్సన్ గౌడ్, బీచుపల్లి నాయుడు, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

అయిజ: పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని, రోడ్లపై నీరు నిలువకుండా గుంతలను పూడ్చాలని, వీధిలైట్లు వెలిగేలా చూడాలని సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వార్డులలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వర్షాలకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ భరత్, వాటర్ లైన్‌మెన్ నరసింహులు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సురేష్, బిల్ కలెక్టర్లు నాగరాజు, నరేష్, మహేంద్రనాథ్, ఆడివన్న, ఆంజనేయులు, వీరేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలలో జాప్యం తగదు

గద్వాల అర్బన్: సంక్షేమ బోర్డు ద్వారా నమోదు చేసుకున్న కార్మికులకు సకాలంలో క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కరోనా విపత్తు కారణంగా కార్మికుల జీవితాలు సంక్షోభంలో పడ్డాయన్నారు. నిర్మాణ రంగాల్లోని కార్మికులకు పెళ్లి కానుక, సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణం, ప్రసూతి సహాయం కోసం నమోదు చేసుకొని నెలలు గడుస్తున్నా.. డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఈ విషయం కార్మిక శాఖలోని ఉన్నతధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని, జిల్లాకు శాశ్వత అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను నియమించాలని, అదనంగా కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని డిమండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలను ఎంఈఓ కొండారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించడంతో పాటు వారానికి మూడు సార్లు గుడ్లు అందించాలన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీల రుణ ప్రక్రియపై సమావేశం

రాజోళి(మానవపాడు): బీసీలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష రుణసాయంపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ రమణా రావు సమావేశం నిర్వహించారు. బుధవారం మానవపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుగా దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులను ఎంపిక చేయాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో చేసుకున్న వృత్తులను పరిశీలించి వివరాలు సేకరించి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజనేయ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.